క్లుప్తంగా

ప్రజాపాలన వివరాల సేకరణ



ఆత్మకూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రూ.500 కే సిలిండర్ పథకానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డుల్లో కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల్లోగా పట్టణంలోని పది వార్డుల్లో గ్యాస్ సిలిండర్ వినియోగదారుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు



ఆత్మకూర్: పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. ఆదివారం పరమేశ్వరస్వామి చెరువు వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు చేపడుతున్న మరమ్మతు పనులు పూర్తయ్యాయని తెలిపారు. గత వారం రోజులుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మదనాపురం: మండలంలోని నెల్విడిలో ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బేరి కొండన్న, ఉపాధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి నాయక్, యువజన విభాగం అధ్యక్షుడిగా తూం రమేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌నాయక్, మరి కొంతమందిని కమిటీ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న, వడ్డె కష్ణ, జగదీష్, హనుమాన్‌రావు, కొండన్న, విజయ్, నర్సింహాయాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా నందికర్



వీపనగండ్ల: స్థానిక ఎస్‌ఐగా నందికర్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. గట్టు మండలంలో పనిచేసిన నందికర్ వీపనగండ్లకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రవిప్రకాశ్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో మండలంలోని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే మండల అభివృద్ధి అధికారిగా పనిచేసిన ఎంపీడీఓ కతలప్ప నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు.

వినాయకుడి విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి మహ్మదుస్సేన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన అల్లిపేట గుట్టపై వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం కమిటీ వారు భూమిపూజ చేశారు. గుట్టపై ఉన్న పురాతన చెన్నకేశవస్వామి ఆలయం వద్ద వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షులు గోపి ముదిరాజ్, మహ్మదుస్సేన్‌పల్లి మాజీ సర్పంచ్ నిర్మలా కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి పురుషోత్తం ముదిరాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, తిరుపతి, మహేష్, బాలయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి జములేశ్వరి మాత ఉత్సవాలు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరి మాత ఉత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. 12న జమ్ములేశ్వరి దేవికి పట్టుచీర ఆభరణాలను పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి అలంకరిస్తామని పేర్కొన్నారు. నెల రోజుల పాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి ఆలయం వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించామన్నారు.

వరికి తెగుళ్ల బెడద

- కాండం తొలుచుపురుగు, ఎర్ర తెగులుతో ఎదగని పైరు
- ఆందోళనలో అన్నదాతలు
- మండలంలో 6,800 ఎకరాల్లో యాసంగి వరి సాగు



కుళ్లిపోతున్న వరి మొక్క



ఖిల్లాఘనపురం చెరువు వెనకాల నెల రోజులు కావస్తున్నా ఎదగని వరి పంట

ఖిల్లాఘనపురం: చెరువులు, కుంటల్లో నీళ్లు పుష్కలంగా ఉండటంతో పాటుగా బోరు బావుల్లోనూ నీరు ఉండటంతో ఎంతో ఆశతో వరి పంటలు సాగు చేసుకున్న రైతులను ఆదిలోనే తెగుళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో కేఎల్‌ఐ సాగునీటిని త్వరగా నిలిపివేశారు. అప్పటికే చెరువుల్లో నీళ్లు నిండుగా ఉండటంతో రైతులు ఎంతో ఆశతో ఆరుతడి పంటల జోలికి పోకుండా వరి సాగు చేశారు. వరి పంట నాటి నెల రోజులు కావస్తున్నా ఎదగక పోవడంతో పాటుగా చనిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏం చేయాలో పాలుపోక ఫర్టిలైజర్ దుకాణాలు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

గతేడాది 8,500 ఎకరాల్లో

మండలంలో ఈ సంవత్సరం యాసంగిలో 6,800 ఎకరాల్లో వరి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది యాసంగిలో 8,500 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కేఎల్‌ఐ కాల్వ నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. యాసంగి పంటగా ఆరుతడి పంటలు 2,265 ఎకరాల్లో సాగు చేసినప్పటికీ ఎక్కువగా వరి పంట సాగు చేశారు.

కాండం తొలుచు పురుగుతో..

వరికి యాసంగిలో ఎక్కువగా తెగుళ్లు సోకి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కాండం తొలుచు పురుగు సోకి పంట పూర్తిగా చనిపోతుంది. కొన్ని గ్రామాల్లో ఎర్రతెగులు సోకి పంట ఎరుపు, పసుపు రంగులోకి మారడంతో పాటుగా ఎదుగుదల తగ్గింది. నెల రోజులు కావస్తున్నా పంట ఎదుగుదల లేకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. అదే జరిగితే పెట్టుబడి కూడా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు.

నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు వల్ల పంట చనిపోవడానికి అవకాశం ఉంది. ఎర్ర తెగులు నివారణకు పంటను తరుచుగా ఆరబెడుతూ ఉండాలి. సూక్ష్మపోషకాల మిశ్రమం 500 గ్రాములు, 19–19–19 గ్రాములు, చిలామిన్ జింక్ 200 గ్రాముల మందులను 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవాలి. కాండం తొలుచు పురుగు నివారణకు 4జీ గుళికలు ఎకరాకు 5 కిలోలు లేదా కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ మందు ఎకరాకు 400 గ్రాముల మందును పంటపై పిచికారీ చేయాలి.

వాతావరణ ప్రభావంతో..



ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న ప్రభావంతో తెగుళ్ల ఎక్కువగా వరి పంటకు సోకుతున్నాయి. ఈ తెగుళ్ల వలన పంటలో ఎదుగుదల క్షీణిస్తుంది. పంట ఎరుపు, పసుపు రంగులోకి మారుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే పంట తిరిగి కోలుకుని అధిక దిగుబడి సాధించొచ్చు. పూర్తి సమాచారానికి మండల వ్యవసాయ కార్యాలయం, లేదా ఏఈఓలను కలిస్తే నేరుగా పంటను పరిశీలించి మందులు రాసి ఇస్తారు.

– మల్లయ్య, ఏఓ, ఖిల్లాఘనపురం

ఘంటసాల గాత్రం పదిలం



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

వనపర్తి టౌన్: తరాలు మారుతున్నా చరిత్రలో ఘంటసాల గాత్రం పదిలంగా ఉంటుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని కళాకారులు సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల గాత్రం నేటికి ప్రజల మనస్సును తట్టిలేపే శక్తి ఉందని, అలాంటి గాత్రంతో ప్రజలను మంత్రముగ్దులు చేసిన మహానీయుడు ఘంటసాల అని కొనియాడారు. దైవ, దేశ భక్తి, ప్రేమ, విరహ ఉత్సాహ పబోధాత్మకమైన పాటలు, రాగం, భావం, మనసుకు హత్తుకునేలా ఉండేవన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం శరవంద, గంధం భాస్కర్, నందిమళ్ల రాములు, గాయకులు మురళీశర్మ, బైరోజు చంద్రశేఖర్, గోవింద్, రాజు, రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, రాం మోహన్, ముమ్మల రాములు, వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్



గోప్లాపూర్‌లో తాగునీటి ట్యాంకు శుభ్రతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదివారం తాగునీటి ట్యాంకుల శుభ్రం చేసే కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాలపై గ్రామాల్లో జీపీ ప్రత్యేకాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలు ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అశోక్‌నాయుడు, జీపీల ప్రత్యేకాధికారులు లక్ష్మణ్‌నాయక్, సాజిద్‌రహమాన్, డా.శ్యామ్, విద్యాసాగర్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మీకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష



మదనాపురంలో గురుకుల పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులతో తల్లిదండ్రులు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 264 మంది విద్యార్థులకు గానూ 234మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ మాలతి తెలిపారు. అదేవిధంగా బాలుర గురుకుల పాఠశాల(వీపనగండ్ల)లో 240మంది విద్యార్థులకు గానూ 221మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ దయాకర్ తెలిపారు. మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్‌లో మొత్తం 240మంది విద్యార్థులకు గానూ 216మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి తెలిపారు. ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగిసింది. కేంద్రాల దగ్గర అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమడబాకుల మోడల్ స్కూల్ వద్ద..

మదనాపురం: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొత్తం 480 మంది విద్యార్థులు గాను 445 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ గంభీరం రవీందర్ చెప్పారు.

గోపాల్‌పేట: బుద్దారం గురుకుల పాఠశాలలో మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 450 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 30 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఆరోగ్యం తెలిపారు.

30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగం బలోపేతం కోసం 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అధ్యక్షుడు వెంకటేష్, రమేష్ డిమాండ్ చేశారు. కానీ ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 7.75శాతం నిధులను కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిధులతో విద్యారంగంలో ఏర్పడిన సంక్షోభానికి పరిష్కారం దొరకదన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు ముగుస్తున్నా ఇంత వరకు విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యారంగానికి అధిక నిధులను మంజూరు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధికి కేవలం రూ.500 కోట్లు కేటాయించడం సమంజసం కాదన్నారు. విద్యా సంస్థలలో మత బోధనలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయికుమార్, శరత్, విశాల్ పాల్గొన్నారు.

పెబ్బేరులో చౌడేశ్వరీ జాతర



పెబ్బేరు రూరల్: పట్టణంలో జరుగుతున్న చౌడేశ్వరి జాతరలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి జ్యోతుల ఊరేగింపు, పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భారీ ఊరేగింపుతో తీసుకొచ్చి చిన్న చౌడేశ్వరీ ఆలయంలో భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు.

ప్రధాని మోదీతోనే సుపరిపాలన సాధ్యం



వెనికితండాలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: దేశంలో సుపరిపాలన, అవినీతి రహిత పాలన కేవలం ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు రవినాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని వెనికితండాలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల నాయకులు తండాలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తండాలోనే గిరిజనులతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి గావ్‌చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్ముకశ్మీర్ ప్రజలకు శాంతి, ప్రగతిని అందిస్తున్నారని తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు రూపం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం వారు రోడ్డుమీదితండాల్లో ఇటీవల మృతిచెందిన సబావత్ సక్రు ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్ నాయక్ పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

కొత్తకోట రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఘణపురం మండలంలోని సల్కెలాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులుకు స్వల్ప గాయాలు కాగా, మరో బైక్‌పై ఉన్న భార్య భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

‘చలో నల్లగొండ’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: కృష్ణానదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటి హక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంస్థ కేఆర్‌ఎంబీకి అధికారాలు అప్పగించడం ద్వారా జరగబోయే అనర్థాలను రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు నల్లగొండ పట్టణంలో ఈనెల 13న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దుప్పల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ శివ, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వీపనగండ్ల ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ చాకలి సంజీవ్ ఇటీవలే బైక్ ప్రమాదంలో మరణించగా.. అతడితో కలిసి 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదువున్న మిత్రులు రూ.66,500 నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి పేదలకు వైద్యం అందించిన సంజీవ్ ప్రమాదంలో మరణించడం బాధాకరమని స్నేహితులు సంతాపం తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగేష్, రాజు, రాముడు, మద్దిలేటి, కృష్ణయ్య, ఈశ్వరయ్య, బీరయ్య, తిరుపతయ్య, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పట్టణ యూత్ అధ్యక్షుడు చిట్యాల లింగస్వామి తండ్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి కుమారుడు ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి ఆదివారం వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామంలోని బాదం సరోజాదేవి కల్యాణ మండపంలో జరిగిన వెంకటయ్యగౌడ్ కుమారుడి వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్, మత్స్యకార సంఘం ఉపాధ్యక్షుడు నరేందర్, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మున్నూరు జయకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగంగా పూర్తి చేస్తాం

అమరచింత: మండలంలోని మస్తీపురం నుంచి కిష్టంపల్లి వరకు జరుగుతున్న బీటీ రహదారి విస్తరణ పనులు త్వరితంగా పూర్తి చేయడానికి అధికారులు చొరవ చూపాలని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. కిష్టంపల్లి నుంచి మస్తీపురం శివారు వరకు సాగుతున్న బీటీ రహదారి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చొరవతో అర్ధాంతరంగా నిలిచిపోయిన బీటీ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా త్వరలోనే ధర్మాపురం నుంచి చంద్రగఢ్ గ్రామం వరకు బీటీ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సత్యన్న, శివారెడ్డి, సుధాకర్, వెంకట్‌రెడ్డి, రాజసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

అడ్డాకుల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని దేవరకద్ర శాసనసభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందూర్ గ్రామంలో ఆదివారం సీసీరోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సీసీరోడ్ల పనులను నాణ్యవంతంగా చేయించాలని, సకాలంలో పనులను పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, అరవింద్‌రెడ్డి, నాగిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాములు, సత్తిరెడ్డి, మనోహర్ తదితరులు ఉన్నారు.

అందరి సుభిక్షం కోసమే పాదయాత్ర

అడ్డాకుల: సకల మానవాళి సుభీక్షంగా ఉండాలనే మహా పాదయాత్ర చేపట్టినట్లు సంకల్పదీక్షా పారాయణులు, ప్రధాన అర్చకులు గట్టు రంగాచార్యులు పేర్కొన్నారు. మండలంలోని కందూర్ గ్రామంలో ఆదివారం గడప గడపకు గోవు, గోవిందుడు, గీత నినాదంతో చేపట్టిన శ్రీవారి తిరుమల మహా పాదయాత్ర 22వ రోజు కందూర్‌కు చేరుకుంది. లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిగారి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో తిరుమలకు చేపట్టిన యాత్రలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలతో పాదయాత్రకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి మాతకు పూజలు



వెండి తొడుగుతో కన్యకా పరమేశ్వరి మాత శోభయాత్ర నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కన్యకా పరమేశ్వరి దేవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 7.2 కిలోల వెండి తొడుగు అలంకరించారు. వెండి తొడుతో అలంకరించిన అమ్మవారిని భవానీ మాత ఆలయం నుంచి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు 108కలశాలతో అంగరంగ వైభవంగా మేళ తాళాలతతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పట్టణ వాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, అర్యవైశ్య సంఘం అధ్యక్షులు భీమ చంద్రకాంత్, కొండ శ్రీనివాసులు, భీమ కిషోర్‌కుమార్, భీమా ప్రభాకర్, ఎలిశెట్టి సత్యం, భీమా భాస్కర్, ఎర్మలి నర్సింహ, కొండ పట్టాభి, భీమ రాజు, విశ్వనాథం శంకర్, చేపర్తి విజయ్, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఆర్యవైశ్య మహిళలు

కేంద్రానికి కనువిప్పు కలిగించాలి



ఆత్మకూర్: దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమలపై ఆధారపడి కోట్లాది మంది కార్మికులు జీవిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లాకార్యదర్శి హన్మంతు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈనెల16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె, బంద్‌లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, ప్రసాద్, రాబర్ట్, వెంకటయ్య, అంజి, కార్మికులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బందును సమన్వయంతో జయప్రదం చేద్దామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం, కల్వరాల గ్రామాల్లో నిరసనకు సంబంధించి పలువురు రైతులు కార్మికులను కలిసి బందులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బందును విజయవంతం చేసి కనువిప్పు కలిగేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మురళి, కృష్ణయ్య, బాలగౌడ్, ఈశ్వర్, వెంకటేశ్వర్ల గౌడ్, రామకృష్ణ, నాగరాజు, నవీన్, రంగస్వామి, వెంకటస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.